సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



రచ్చపల్లిలో వైద్య శిబిరం

మంథని: విషజ్వరాలతో ఇబ్బంది పడుతున్న రచ్చపల్లిలో గురువారం గద్దలపల్లి వైద్యులు గురువారం శిబిరం ఏర్పాటు చేశారు. శంకరాదేవి ఆధ్వర్యంలో వైద్య సేవలందించినట్లు సర్పంచ్ కనవేన శ్రీనివాస్ తెలిపారు.



ముస్లింలకు ఇఫ్తార్ విందు

సుల్తానాబాద్: జిల్లా కేంద్రంలోని ఎంపీ గార్డెన్‌లో ముస్లింలకు నల్ల ఫౌండేషన్ చైర్మన్ నల్ల మనోహర్ రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
41.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటిపూట ఉక్కపోత పెరుగుతుంది.

మానవులందరూ ఒక్కటే కలిసిమెలిసి జీవించండి. పరస్పరం శత్రువులుగా మారకండి.

– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:35	శని 4:33

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక

సుల్తానాబాద్: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. రాజీమార్గం ద్వారా ఇరువర్గాలు లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. పలువురు న్యాయవాదులు చట్టాలపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకిషన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెగడ శ్యాంసుందర్, ఏజీపీ మేకల తిరుపతి రెడ్డి, లోక్ అదాలత్ సభ్యుడు జోగుల రమేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ

కోల్‌సిటీ: ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కార్పొరేషన్ కమిషనర్ సుమన్‌రావు తెలిపారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) 2020కు రూ.వెయ్యి చెల్లించి నమోదు చేసుకున్న వారు కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో సంప్రదించాలని సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలో 7061 ఖాళీ స్థలాల యజమానులు దరఖాస్తు చేసుకున్నారని, స్థలానికి సంబంధించి డాక్యుమెంట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ధృవీకరిస్తారని పేర్కొన్నారు. తదుపరి పూర్తి రుసుం చెల్లిస్తే ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరించి ధృవీకరణ పత్రం జారీ చేస్తామన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు రక్షించవచ్చు

కోల్‌సిటీ: సీపీఆర్‌తో ప్రాణాలు రక్షించవచ్చు అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కృపాబాయి ఆధ్వర్యంలో వైద్య బృందం సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. గుండెపోటుకు గురై పడిపోయిన వారిని రక్షించేందుకు సీపీఆర్ అవసరమన్నారు. ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, ఎస్ఈ చిన్నారావు, మెప్మా డీఎంసీ రజిని తదితరులున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు జిల్లా నుంచి 16 బస్సులు



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

జ్యోతినగర్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు జిల్లా నుంచి 16 బస్సుల్లో ప్రజలను తరలిస్తున్నట్లు అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈనెల 14న ఉదయం పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల నుంచి 6 బస్సులు, మంథని 3, ధర్మపురి నియోజకవర్గం ధర్మారం నుంచి ఒక బస్ చొప్పున మండల కేంద్రాల నుంచి ఉదయం 7 గంటలకు బయల్దేరుతాయని తెలిపారు. ప్రజలు తిరిగి వచ్చేవరకూ ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి బస్సులో ఇద్దరు డ్రైవర్లు, లైజనింగ్ అధికారి, పోలీస్ అధికారి, అసిస్టెంట్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు, బస్సులో తాగునీటి బాటిళ్లు, స్నాక్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి బస్సులో 50మంది వరకు ప్రజలు ఉంటారని, వారందరికీ ఎంట్రి పాస్‌లను లైజనింగ్ అధికారి అందిస్తారని వివరించారు. డీఆర్‌డీవో శ్రీధర్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు సుమన్‌రావు, రాజశేఖర్, ఎంపీఓలు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌ను ఆనుకుని ఉన్న రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డుపై వాహనాల మరమ్మతు చేసే ఆటోనగర్. సర్వీస్ రోడ్డుపై మరమ్మతు చేస్తుండడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సంఘటనల్లో ప్రజలు మృతి చెందుతున్నారు కూడా. ఇటీవలే ఆగి ఉన్న ఓ లారీని ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. మరో ఘటనలో లారీ రివర్స్ తీస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా.. విద్యుత్ లైట్ బాలిక మీద పడి ఆమె తలకు తీవ్ర గాయమైంది. ఇలా తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుడంతో స్థానికులు ఆటోనగర్‌ను తరలించాలని ఏళ్ల తరబడిగా కోరుతున్నారు. అయినా పనులు మాత్రం ముందుకుసాగటం లేదు.

తరలింపు ఎప్పుడో..!?

ఆటోనగర్ వద్ద తరచూ ప్రమాదాలు

- నత్తనడకన ఆటోనగర్ తరలింపు
- వసతులు కల్పించక ఆలస్యం
- సర్వీస్‌రోడ్డు పైనే మరమ్మతులు

సాక్షి, పెద్దపల్లి: పెరిగిన వాహనాల రద్దీ.. తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలను నివారించేందుకు ఎన్టీపీసీలో ఉన్న ఆటోనగర్‌ను అంతర్గాం మండలం కుందనపల్లికి తరలించే ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ)కు స్థలం, నిధులు కేటాయించినా మౌళిక వసతులు కల్పన పనులు మాత్రం ముందుకు సాగటం లేదు. దీంతో పారిశ్రామిక ప్రాంతవాసులతోపాటు, మెకానిక్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2017మార్చి 31న శంకుస్థాపన

అంతర్గాం మండలం కుందనపల్లిలో అప్పటి తహసీల్దార్ 26ఎకరాల స్థలం కేటాయించారు. అందులో ఆరెకరాలు రోడ్లు, ఇతరత్రా అవసరాలకు పోను మగితా 18 ఎకరాల్లో అర్హులైన మెకానిక్‌లకు స్థలం కేటాయించాల్సి ఉంటుంది. ఇతరత్రా అవసరాలకు భూమిని కేటాయించటంతో చివరకు 10.5ఎకరాల స్థలాన్ని లేఔట్ చేసి రూ.3.50 కోట్లతో 2017మార్చి 31న రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి కేటీఆర్ ఆటోనగర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తరువాత మొత్తం 200మంది లబ్ధిదారులకు డ్రా పద్ధతిన ఎంపిక చేసి ప్లాట్లను కేటాయించారు. 'వసతులు అన్ని ప్రభుత్వం కల్పిస్తుంది.. మీరు కేవలం షెడ్లు వేసుకుంటే సరిపోతుంది.. ఎలాంటి ఖర్చు ఉండదు..' అని చెప్పటంతో మెకానిక్‌లు తమ కష్టాలు తీరాయని, శాశ్వత ఉపాధి దొరుకుతుందని సంతోషపడ్డారు. కానీ.. ఇప్పటివరకు అతీగతిలేదని మెకానిక్‌లు వాపోతున్నారు.



రోడ్డుపైనే మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు

సర్వీస్ రోడ్లపైనే మరమ్మతు

ప్రస్తుతం కొనసాగుతున్న ఆటోనగర్ ఎన్టీపీసీ మేడిపల్లి చౌరస్తాలో రాజీవ్‌రహదారికి ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డు వెంబడి సుమారు మూడు కిలోమీటర్ల పొడవునా 300 వాహనాల మరమ్మతు దుకాణాలున్నాయి. వాహనాల మరమ్మతు చేయించుకోవడానికి వచ్చే భారీ, చిన్న వాహనాలతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. సర్వీస్ రోడ్డుపైనే భారీ వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపి మరమ్మతు చేస్తుండటంతో మిగితా వాహనాదారులు, కాలినడకన వెళ్లేవారు ప్రమాదాల బారినపడుతున్నారు. ఏడేళ్ల క్రితం ప్రమాదాలతో ఆటోనగర్ తరలింపు ఆలోచన చేసినప్పటికీ ఇప్పటివరకు వాహనాల రద్దీ, ప్రమాదాల తీవ్రత పెరుగుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ఆటోనగర్ తరలింపు పనులను వేగవంతం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. మరోవైపు రాజీవ్‌రహదారి విస్తరణ పనులు, తదితర కారణాలతో తమకూ ఇబ్బందిగానే ఉందని, సదుపాయాలు లేక ఆటోనగర్‌లో భవన నిర్మాణాలు చేపట్టలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునే వారు లేరు



ఆటోనగర్ ఏర్పాటుకు సుమారు 50 ఎకరాలకు పైబడి ఉంటేనే సాధ్యం. ప్రభుత్వం తక్కువ స్థలం కేటాయించినా విధిలేని పరిస్థితుల్లోనే స్వీకరించాల్సి వచ్చింది. 300మంది ఉంటే కేవలం 200మందికే ప్లాట్లు కేటాయించారు. అక్కడ సదుపాయాలు కల్పించకపోవడం .. కార్మికులకు ప్లాట్లు కేటాయించకపోవడంతో తరలింపు ప్రక్రియ ముందుకు కదలడం లేదు. అర్హుందరికీ ప్లాట్ కేటాయించేలా అధికారులు, నేతలు చొరవ తీసుకోవాలి. – మురళి, ఆటోనగర్ అధ్యక్షుడు



ఓసీపీలో బొగ్గు వెలికితీస్తున్న యంత్రాలు

భారీ లక్ష్యం వైపు సింగరేణి చూపు

- 2023-24లో 78మిలియన్ టన్నుల టార్గెట్
- ఓసీపీ, నైనీ బ్లాక్‌కు టార్గెట్
- భూగర్భగనుల ద్వారా 8.24 మిలియన్ టన్నులు
- ఓసీపీల ద్వారా 69.76 మిలియన్ టన్నులు

ఏరియా	లక్ష్యం మి.టన్నుల్లో
ఆర్జీ–1	4.38
ఆర్జీ–2	9.40
ఆర్జీ–3	5.50
ఏపీఏ	1.73
భూపాల్‌పల్లి	4.94
నైనీబ్లాక్	6
కొత్తగూడెం	15.45
ఇల్లెందు	4
మణుగూరు	11.95
బెల్లంపల్లి	3.40
మందమర్రి	4.61
శ్రీరాంపూర్	6.64
మొత్తం	78

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తిలో భారీ లక్ష్యాలతో సింగరేణి సంస్థ ముందుకు సాగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 78 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించింది. గతేడాది 74మిలియన్ టన్నుల లక్ష్యంగా ముందుకెళ్లగా 67.50 మిలియన్ టన్నులు సాధించింది. నైనీ బ్లాక్ ద్వారా ఆరు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని వెలికి తీయాలని నిర్ణయించింది. గతేడాది 0.20మిలియన్ టన్నుల ఉన్న బొగ్గు ఉత్పత్తి ఈసారి ఏకంగా 6మిలియన్ టన్నుల లక్ష్యం విధించింది. అత్యధికంగా కొత్తగూడెం ఏరియాకు 15.45మిలియన్ టన్నులు, మణుగూరు ఏరియాకు 11.95మిలియన్ టన్నులుగా నిర్దేశించింది. అత్యల్పంగా అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో 1.73మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీయాలని నిర్ణయించింది.

ఓసీపీలపై భారీ లక్ష్యం..

సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఓసీపీలపై భారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను యాజమాన్యం నిర్దేశించింది. 78మిలియన్ టన్నుల లక్ష్యాల్లో 69.76 మిలియన్ టన్నులు ఓసీపీల ద్వారానే బొగ్గు వెలికితీయాలని నిర్దేశించారు. దీని ఓసీపీలు ఎక్కువగా ఉన్న ఏరియాలో అదేస్థాయిలో ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించారు. భూగర్భగనుల ద్వారా కేవలం 8.24మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించారు.

డైరెక్టర్ల ప్రత్యేక దృష్టి

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై సింగరేణి డైరెక్టర్లు దృష్టి సారించారు. ఏరియాల లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తి సాధించాలని ఇప్పటినుండి దిశానిర్దేశం చేస్తున్నారు. సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు అన్ని ఏరియాల్లో పర్యటిస్తున్నారు. గతేడాదికన్నా భారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించిన క్రమంలో ఈసారి భారీగా బొగ్గు వెలికితీయాల్సి ఉంటుందని ఏరియా స్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని, రాబోయే వర్షాకాలానికి ఇప్పటినుండే ఓసీపీల్లో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే నెలలో రెండుసార్లు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ లక్ష్యాలను సాధ్యమైనంత తొందరగా, రక్షణతో తీయాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ఉత్పత్తితో పాటు రక్షణకు కూడా ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు.

నాణ్యతతో సీఎమ్మార్ ఇవ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత, చిత్రంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, అధికారులు

- ఎఫ్‌సీఐతో సమన్వయానికి వాట్సాప్ గ్రూప్
- రైస్ మిల్లులను పూర్తి సామర్థ్యంతో నిర్వహించాలి
- కలెక్టర్ సంగీత వెల్లడి

జ్యోతినగర్: నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జిల్లాలోని మిల్లర్లు ఎఫ్‌సీఐ అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన సీఎమ్మార్ రైస్ పంపిణీ చేయాలని కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి సీఎమ్మార్ బియ్యం పంపిణీపై అధికారులు, రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రైస్ మిల్లులు పూర్తి సామర్థ్యం మేర నిర్వహించాలని, మిల్లింగ్ వేగం పెంచాలని యాసంగి పంటకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బియ్యాన్ని త్వరగా అందించాలని సూచించారు. 2021–22 యాసంగి బియ్యం గడువుకు మరో 12 రోజుల సమయం మాత్రం ఉందని, మిల్లులు పూర్తి సామర్థ్యంతో నిర్వహించి ఎఫ్‌సీఐకి అందించాలని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐ వద్ద రైస్ మిల్లర్లకు ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారానికి సమన్వయం కోసం వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయడంతో పాటు డీటీలను నియమిస్తామన్నారు. హమాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైస్ మిల్లర్ల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు వచ్చే మంగళవారం అదనపు కలెక్టర్, ఎఫ్‌సీఐ రీజినల్ మేనేజర్ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో గోదాములను పరిశీలించాలన్నారు. సమావేశంలో ఎఫ్‌సీఐ రీజనల్ మేనేజర్ విశాల్ గుప్తా, జిల్లా పౌర సరఫరాల అధికారి తోట వెంకటేశ్, డిప్యూటీ తహసీల్దార్లు, మిల్లర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా నిలిచిన శ్రీపాదరావు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- శ్రీపాదరావుకు నివాళి

కమాన్‌పూర్(మంథని): నిరుపేద ప్రజలకు అండగా నిలిచిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శ్రీపాదరావు 24వ వర్ధంతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. మంథని నియోజకవర్గంలో ప్రజలు పోలీసులతో ఇబ్బంది పడుతుంటే శ్రీపాదరావు వారికి వెన్నంటి ఉన్నారని పేర్కొన్నారు. శ్రీధర్‌బాబు నాయకత్వం రాష్ట్రానికి అవసరమన్నారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో వైఎస్.రాజశేఖర రెడ్డి చొరవతో గోదావరి నదిపై ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించి పైపులైన్‌తో టూటీఎంసీ నీటిని మంథని ప్రాంతానికి తరలించామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ మంథని అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌గౌడ్, కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ వైనాల రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాజయ్య, శశిభూషన్‌కాచే, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం: రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలిపారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ కార్పొరేటర్లు, ఎస్సీ, బీసీ, మహిళా, మైనార్టీ, యువజన, ఎన్ఎస్‌యూఐ, నాయకులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.





నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్



పూలమాల వేస్తున్న విజయ రమణారావు

శ్రీపాదరావు ఆశయ సాధనకు కృషి

సుల్తానాబాద్: శ్రీపాదరావు ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయ రమణారావు అన్నారు. పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరులు సింహభాగం మంథనికే..

మంథని: మంథని డివిజన్‌లో శ్రీపాదరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీపాదచౌక్, రావుల చెరువుకట్టలో శ్రీపాదరావు తనయుడు, స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. మంథని ప్రాంతానికి వన్నె తెచ్చేలా శ్రీపాదరావు పనిచేశారని కొనియాడారు. రాష్ట్రంలోని ఆర్థిక వనరులు సింహభాగాన్ని ఈ ప్రాంతానికి తీసుకురావాలనేదే తన ప్రయత్నమని పేర్కొన్నారు. ముత్తారం మండలం కేశనపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యక్తులదే హల్‌చల్..!

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారిదే కీలక పాత్ర
- దస్తావేజుల తయారీ.. కంప్యూటర్ ఆపరేటర్లు
- అధికారులు అందుబాటులో లేకున్నా యథావిధిగా రిజిస్ట్రేషన్లు
- పెద్ద ఎత్తున చేతులు మారుతున్న వైనం...?

మంథని: జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల హవా నడుస్తోంది. కార్యాలయాల్లో వీరే కీలక పాత్ర పోషిస్తున్నారు. దస్తావేజుల తయారీ, స్కానింగ్, ఇతర ముఖ్యమైన వ్యవహారాల్లో తలదూర్చుతున్నారు. కొన్ని కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లు అందుబాటులో లేకున్నా.. రిజిస్ట్రేషన్లు నడుస్తున్నాయంటే వారి జోక్యం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

వారిని కలిస్తే సరి..

జిల్లాలో మంథని, సుల్తానాబాద్, పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. తాజాగా రామగుండంకు కొత్తగా సబ్ రిజిస్ట్రార్ మంజూరైంది. అయితే మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్, (ప్రస్తుతం రామగుండం ఇన్‌చార్జి) ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇందులో ఒకరు లాంగ్‌లీవ్, అటెండర్ ఉన్నారు. కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌గా ప్రైవేటు వ్యక్తులు పనిచేస్తున్నారు. పెద్దపల్లిలో సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు ఇద్దరు, అటెండర్లు ఇద్దరు ఉన్నారు. ఇక్కడా ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు పనిచేస్తున్నారు. సుల్తానాబాద్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్, ఓ ప్రైవేటు వ్యక్తి పనిచేస్తున్నాడు. డాక్యుమెంట్ల స్కానింగ్, వివరాల నమోదు ప్రక్రియ కంప్యూటర్ ఆపరేటర్ల చేతుల్లో పెట్టారు. వీరంతా ప్రైవేట్ వ్యక్తులే కావడంతో అనేక లోటుపాట్లకు అవకాశం ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి.

డాక్యుమెంట్ రైటర్లకు మధ్యవర్తులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో జరిగే రిజిస్ట్రేషన్లకు దస్తావేజులను డాక్యుమెంట్ రైటర్లు సిద్ధం చేస్తారు. అయితే కార్యాలయంలో అవి చెల్లుబాటు అయ్యేందుకు దస్తావేజులేఖరులు ముందుగా ప్రైవేటు వ్యక్తులనే కలుస్తారని సమాచారం. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి డాక్యుమెంట్లలో ఏదేని లొసుగులు ఉన్నా ఆ సమాచారం ముందుగా దస్తావేజు లేఖర్లు ప్రైవేటు వ్యక్తులకు అందిస్తారు. వారు సబ్ రిజిస్ట్రార్ల దృష్టికి తీసుకెళ్లి 'రేటు' నిర్ణయిస్తారని సమాచారం. ఈ క్రమంలో అనేక తప్పులతోపాటు పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ అందుబాటులో లేకున్నా అక్కడున్న ప్రైవేటు వ్యక్తే అన్ని తానై డాక్యుమెంట్ సిద్ధం చేసి కేవలం సబ్ రిజిస్ట్రార్ సంతకం మాత్రమే తీసుకుంటాడని సమాచారం. ఇలా ప్రైవేటు వ్యక్తులు సబ్ రిజిస్ట్రార్లకు మధ్యవర్తులుగా పనిచేస్తూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.



సుల్తానాబాద్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తి



మంథనిలో కంప్యూటర్ ఆపరేటర్ విధుల్లో..

సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు

నాన్ లేఅవుట్ రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ జిల్లాలో పలుచోట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ విషయంపై పలు ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టినట్లు సమాచారం. అలాంటి సబ్ రిజిస్ట్రార్ల వ్యవహారంపై దృష్టి సారించినట్లు సమాచారం.

అగ్నిమాపక సిబ్బంది ర్యాలీ



గోదావరిఖని: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం గోదావరిఖనిలో ర్యాలీ నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ షేక్‌ఖాజా కరీముల్లా, మేయర్ అనిల్‌కుమార్ పాల్గొని ఫ్లెక్సీ, వాల్‌పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గోదావరిఖని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 14నుంచి 20వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అగ్నిప్రమాదాలు నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణ, ఆస్తుల రక్షణకు సూచనలు ఇస్తూ కనీస బాధ్యతలు తెలియజేస్తామని పేర్కొన్నారు. వంటగ్యాస్ వాడకం, విద్యుత్ రక్షణ, బ్యాంకులు, ఆసుపత్రులు, స్కూళ్లు, కాలేజీల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తామని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సత్తయ్య, సురేష్‌బాబు, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదాన శిబిరంలో రాజగోపాల్, సభ్యులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కావేటి రాజగోపాల్ అన్నారు. గురువారం సంస్థ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేయవచ్చని, ప్రతిఒక్కరూ చేయాలని కోరారు. కళాశాలలో చదువుతున్న ఆర్టిఫిషియల్ లెగ్ కలిగిన వంగల నరసింహ కూడా రక్తదానం చేసి, స్ఫూర్తిగా నిలిచాడని అన్నారు. రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను కళాశాల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ డిస్ట్రిక్ట్ సభ్యులు పాంపాటి శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ శ్రీరామ్, కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్, లెక్చరర్లు పాల్గొన్నారు.

గేదెల కాపరి బలవన్మరణం


రమేశ్ (ఫైల్)


ధర్మారం(ధర్మపురి): మండలంలోని రచ్చపల్లి గ్రామానికి చెందిన గేదెల కాపరి బొమ్మరవేని రమేశ్ (37) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రమేశ్‌కు భార్య సునీత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అతను మద్యం తాగిన ప్రతీసారి ఇంటికి వచ్చి, భార్యాపిల్లలను దూషిస్తూ కొట్టేవాడు. రెండు రోజుల క్రితం వారిపై చేయి చేసుకోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఒంటరిగా ఉంటున్న రమేశ్ జీవితంపై విరక్తి చెంది, గురువారం తెల్లవారుజామున తన మంచంపై భార్యాపిల్లల ఫొటోలు ఉంచి, ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆసియా కప్ టోర్నమెంట్ స్టేజ్-2కు చికిత


చికిత

ఎలిగేడు(పెద్దపల్లి): ఆసియా కప్ ప్రపంచ ర్యాంకింగ్ టోర్నమెంట్ స్టేజ్-2కు కాంపౌండ్ ఆర్చరీ మహిళా విభాగంలో ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన తానిపర్తి చికితను ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా మండల ప్రజాప్రతినిధులు, సుల్తాన్‌పూర్ గ్రామస్తులు ఆమెను అభినందించారు.

టీచర్ల మెడపై ప్రై'వేటు'



ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అడ్మిషన్ల కత్తి వేలాడుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి యాజమాన్యాలు అడ్మిషన్ల టార్గెట్ విధిస్తున్నాయి. పిల్లలను చేర్పిస్తేనే కొలువు ఉంటుందని లేకుంటే భద్రత భరోసా ఇవ్వమని యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. దీంతో తమ కొలువులు ఉంటాయో, ఉడుతాయో తెలియని పరిస్థితుల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను ప్రాధేయపడుతున్నారు. బోధనతో పాటు అదనపు తరగతులు, పాఠశాలలకు ఒంటిపూట బడులు నడుస్తున్న నేపథ్యంలో స్కూల్ సమయం పూర్తయిన తర్వాత మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అడ్మిషన్‌ల కోసం ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతున్నారు. శని, ఆదివారాలు సెలవు వచ్చిందంటే అడ్మిషన్ల కోసం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లా అడ్మిషన్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో 1,850 మంది ప్రైవేటు టీచర్స్

పెద్దపల్లి జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు సుమారు 160 ఉన్నాయి. వీటిలో దాదాపు 1,850 మంది డిగ్రీ , బీఎడ్, డీఎడ్ చేసి ప్రభుత్వ ఉద్యోగాలు రాక గత్యంతరం లేక కుటుంబ పోషణకు ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్నారు. కాగా ప్రైవేటు యాజమాన్యాలు రెండునెలలు ముందుగానే అడ్మిషన్ల టార్గెట్ విధిస్తున్నాయి. వేసవి సెలవుల్లో కూడా అడ్మిషన్లు చేస్తేనే వచ్చే విద్యా సంవత్సరం పని చేస్తారని లేదంటే వేరే పని చూసుకోవచ్చని స్పష్టం చేయడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతున్నారు. తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. ఇప్పటికే సంవత్సరంలో పది నెల జీతం మాత్రమే చెల్లిస్తున్న యాజమాన్యాలు పని మాత్రం 12 నెలలు చేయించుకుంటున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీచర్లకు చాలీచాలని జీతాలు

జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్ల టీచర్లు తెల్లారేసరికి క్యాంపెయినింగ్ పేరుతో రోడ్డు ఎక్కుతున్నారు. తమ పాఠశాలలో ఉన్న సౌకర్యాలు గురించి వివరిస్తూ తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ప్రైవేట్ స్కూళ్ల టీచర్లకు యాజమాన్యాలు ఇచ్చే వేతనం అరకొర మాత్రమే. ప్రాథమిక స్థాయి విద్యాబోధనకు రూ.3వేల నుంచి రూ.6వేల వరకు ఇస్తున్నారు. హైస్కూల్ అనుభవం ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు రూ.6వేల నుంచి రూ.12వేల వరకు ఇస్తున్నారు. ప్రభుత్వం జీవో ప్రకారం విద్యార్థుల ఫీజు నుంచి వసూలు చేసిన వాటిలో 59 శాతం టీచర్ల వేతనాలకు ఇవ్వాలని నిబంధన ఉంది. కానీ ఎక్కడ అమలు చేయడం లేదు. జీవో విడుదల చేసినా ఫలితం లేకుండా పోయింది. కష్టపడి పాఠాలు బోధించి, విద్యార్థులు ర్యాంకులు సాధించేలా సాధించేలా కృషి చేస్తూ స్కూళ్లకు మంచి పేరు తెచ్చిపెడుతున్న టీచర్లకు సరైన వేతనాలు ఇవ్వకుండా వారికి కష్టాన్ని దోచుకొని యాజమాన్యాలు తమ జేబులు నింపుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

టార్గెట్ పూర్తయితేనే ఉద్యోగం

ఇచ్చిన అడ్మిషన్ పూర్తి చేస్తేనే రెండు నెలల వేసవి సెలవుల్లో జీతం ఇస్తామని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు పెట్టాయి. ఒక ఉపాధ్యాయుడు 10 నుంచి 15 మంది పిల్లలను కచ్చితంగా పాఠశాలలో చేర్పాలని నిబంధనలు విధిస్తున్నారు.

గొల్లకుర్మల సంక్షేమానికి పెద్దపీట


కార్యక్రమంలో పాల్గొన్న యాదవులు

- త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ
- శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): గొల్ల, కుర్మల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని శాసనమండలి చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాద్‌రావు అన్నారు. గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రెండో వార్షికోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్నివర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. రెండోవిడతలో అర్హులైన గొల్ల, కుర్మలకు గొర్రెలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సబ్బండ వర్గాల మేలు కోసం పనిచేసే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రామగుండం, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. గొర్రెకాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ రెండేళ్లలో సంఘం సాధించిన విజయాలు వివరించారు. జాతి ఐక్యతకు కలిసికట్టుగా పనిచేయాలని తీర్మానించారు. అనంతరం పలువురు ముఖ్య నాయకులను సన్మానించారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం, అయోధ్య, ఫకీరప్ప, జిల్లా నాయకులు పెగడ రమేశ్, వేల్పుల నాగరాజు, మేకల నర్సయ్య, గుంట బాపు పాల్గొన్నారు.

బాణాసంచా పేల్చినవారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి


డాక్టర్ నగేశ్

ధర్మారం(ధర్మపురి): బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో బాణాసంచా పేల్చి, పలువురి మృతికి కారణమైన ఆ పార్టీ నాయకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ధర్మారంలో విలేకరులతో మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించి, రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. బీఆర్ఎస్ సర్కారు ప్రజల సమస్యలు పట్టించుకోకుండా తిరిగి మూడోసారి అధికారంలోకి రావాలని తప్పుడు ప్రయోగాలు చేస్తోందని విమర్శించారు. ఆత్మీయ సమ్మేళనాలతో డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

భార్య మీద కోపంతో ఇంటికి నిప్పుపెట్టిన భర్త


కాలిపోయిన సామగ్రి

జ్యోతినగర్(రామగుండం): భార్య మీద కోపంతో ఓ భర్త ఇంటికి నిప్పు పెట్టిన సంఘటన ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. క్రషర్‌నగర్‌లో నివాసముంటున్న రవీందర్–రహీమా ప్రేమ వివాహం చేసుకున్నారు. రవీందర్‌కు లారీ ఉంది. గత కొన్ని రోజులుగా దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రహీమా ఇంటికి తాళం వేసి, గోదావరిఖనిలోని పుట్టింటికి వెళ్లింది. అదేరోజు రాత్రి ఇంటికి వచ్చిన రవీందర్ భార్యపై కోపంతో తాళం పగులగొట్టి, కొన్ని వస్తువులను బయట పడేశాడు. పెట్రోలు పోసి, ఇంటికి నిప్పంటించాడు. స్థానికులు గమనించి, మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని రహీమా గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు.. ఐదుగురికి గాయాలు


చికిత్స పొందుతున్న బాధితులు

మంథని: ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయపడినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంథని మండలంలోని లక్కేపూర్ గ్రామానికి చెందిన ఫాతిమా, అశ్మ, షబానా, అమీనాతోపాటు నాలుగేళ్ల బాలుడు రెహాన్ గురువారం రామగిరి మండలంలోని సెంటనరీకాలనీకి వెళ్లారు. అక్కడ రంజాన్ సందర్భంగా అందించిన చీరలు తీసుకొని, ఆటోలో తమ గ్రామానికి బయలుదేరారు. మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి లక్కేపూర్ మూలమలుపు వద్ద ఆటోను వెనక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఫాతిమాకుడి చేయి, తలకు, అశ్మకు కుడి మోకాలు, ఇతర శరీర భాగాలు, షబానాకు ఎడమ కాలికి గాయాలయ్యాయి. ఆటోడ్రైవర్ రవి, బాలుడు కూడా గాయపడ్డారు. బాధితులకు మంథని సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి, కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేధింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య


శ్రీకాంత్ (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): తాను రాసిన వార్తలపై కొందరు వ్యక్తులు కుట్రతో తనను వేధింపులకు గురిచేస్తున్నారని ఓ విలేకరి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన పొన్నం శ్రీకాంత్ ఓ దినపత్రికలో రామగిరి మండల విలేకరిగా పని చేస్తున్నాడు. ఇటీవల తాను వార్తలు రాసినందుకు కొందరు వ్యక్తులు పలుమార్లు ఇబ్బందులకు గురిచేయడం వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఎస్సైకి తన సొంత వాట్సాప్ గ్రూపులో బుధవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో మెస్సేజ్ పెట్టాడు. తన చావుకు కాంగ్రెస్ ఎంపీటీసీ కొప్పుల గణపతి, చిందం రమేశ్, పొన్నం శ్రీనివాస్, కోట రవీందర్ కారణమని, వారిని శిక్షించాలని, జర్నలిస్టులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరాడు. ఇది చూసిన పలువురు ఆందోళన చెంది, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. చివరకు గురువారం ఉదయం 6 గంటలకు పెద్దపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో రెండు ముక్కలైన అతని మృతదేహం కనిపించింది. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీకాంత్ మృతి పట్ల టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు నారాయణదాస్ అశోక్, దాడుల వ్యతిరేక కమిటీ జిల్లా కన్వీనర్ సీపెల్లి రాజేశం, కో–కన్వీనర్ చింతకింది చంద్రమౌళి, జిల్లా సంయుక్త కార్యదర్శి కొమురోజు చంద్రమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీకాంత్ పోస్టు చేసిన మెస్సేజ్ ఆధారంగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. పోస్టుమార్టం అనంతరం అతని మృతదేహాన్ని నాగేపల్లి గ్రామానికి తరలించారు.

అంతిమయాత్రలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్

పొన్నం శ్రీకాంత్ అంతిమయాత్రలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పాల్గొన్నారు. అంతకుముందు అతని మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. చైర్మన్ వెంట బీఆర్ఎస్ నాయకులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


కుమారస్వామి (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన జనగామ కుమారస్వామి(51) నాయీబ్రహ్మణుడు. వృత్తి రీత్యా గురువారం తన ద్విచక్ర వాహనంపై నర్సయ్యపల్లి వెళ్లాడు. తిరిగి గర్రెపల్లికి వస్తూ నర్సయ్యపల్లి స్టేజి వద్ద రాజీవ్ రహదారి దాటుతుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కుమారస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

పంట అవశేషాలకు నిప్పుతో ముప్పు

- వరి కొయ్యలను నేలలో కలియదున్నాలి
- డీఏవో ఆదిరెడ్డి



జ్యోతినగర్(రామగుండం): పంట అవశేషాలకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని డీఏవో ఆదిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వరి కోత అనంతరం గడ్డిని దాచుకొని, పశువులకు మేతగా వాడుకునేవారన్నారు. కూలీల కొరత, హార్వెస్టర్ల వినియోగం పెరిగాక వరిని పైపైనే కోయడం వల్ల గడ్డి కట్టలు కట్టేందుకు పనికి రాకుండా పోతోందని చెప్పారు. దాన్ని అలాగే వదిలేసి, తర్వాతి పంట వేసేటప్పుడు కాలుస్తున్నారని, ఇది సరికాదన్నారు.

ఉష్ణోగ్రత పెరిగి, తేమ ఆవిరవుతుంది..

పంట అవశేషాలు తగలబెట్టడం వల్ల వచ్చే వేడి భూమిలోకి దాదాపు ఒక సెంటీమీటర్ లోతు వరకు వెళ్లి, ఉష్ణోగ్రత 33.8 డిగ్రీల నుంచి 42.2 డిగ్రీల వరకు పెరుగుతుంది. దీనివల్ల భూ పొరల్లో ఉండే తేమ ఆవిరైపోవడంతోపాటు ఉపయోగకరమైన బ్యాక్టీరియాలు, శిలీంధ్రాలు నశించిపోయి, భూసారం, సేంద్రియ నాణ్యత దెబ్బతింటుందని డీఏవో తెలిపారు. వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుందని, మొక్కలకు 2 శాతం యూరియా, 4 శాతం ఫాస్ఫరస్ అదనంగా లభిస్తాయని, సేంద్రియ ఎరువుగా ఉపయోగపడి, సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడి ఐదు నుంచి పది శాతానికి పెరుగుతుందని పేర్కొన్నారు. ఒకసారి కొయ్యకాళ్లను కాల్చితే వ్యవసాయం 20 ఏళ్లు వెనక్కి వెళ్లినట్లేనని చెప్పారు. మట్టిలో కోటాను కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయని, పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా కొయ్యకాళ్లను తగలబెట్టినప్పుడు చనిపోతాయని తెలిపారు.

రోటోవేటర్‌తో దున్నితే మేలు..

రోటోవేటర్‌తో దున్నడం వల్ల కొయ్యకాళ్లను చిన్నచిన్న ముక్కలుగా చేసి, పౌడర్‌గా మార్చవచ్చని డీఏవో అన్నారు. తర్వాత రెండు బస్తాల సూపర్ ఫాస్ఫేట్ వేసి, దున్నితే భూమి సారవంతంగా మారుతుందని తెలిపారు. దీంతో 10 ట్రాక్టర్ల మట్టి వేసినట్లవుతుందని, పంట దిగుబడి పెరుగుతుందన్నారు. భూ భౌతిక స్థితికి పెను విఘాతం కలిగే పనులు చేయవద్దని, పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. వరి కొయ్యలు నేలలో కలియదున్నే పద్ధతి అవలంబించాలని రైతులకు సూచించారు.

'సత్యాగ్రహ' సభకు తరలిరండి

- ఏఐసీసీ సభ్యుడు సంపత్‌కుమార్


మాట్లాడుతున్న సంపత్‌కుమార్, చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

గోదావరిఖని(రామగుండం): మంచిర్యాల జిల్లాలో ఈనెల 14న జరిగే జైభారత్ సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని ఏఐసీసీ సభ్యుడు సంపత్ కుమార్, జిల్లా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్. రాజ్‌ఠాగూర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సత్యాగ్రహ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని, ఈ సభకు రామగుండం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలన్నారు. 300 కిలోమీటర్లకు పైగా బట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తున్నారని, దీనికి విరామంలా సమావేశం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. న్యాయమూర్తుల ఆదేశాలను తుంగలో తొక్కుతూ కేంద్రప్రభుత్వం పార్లమెంట్ నుంచి రాహుల్‌గాంధీని సస్పెండ్ చేశారని, తొమ్మిదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ పాలనతో దళితులు అన్యాయానికి గురయ్యారని వివరించారు. దళిత రైతులకు ఇచ్చిన భూములను లాక్కుని ప్రభుత్వ భవనాలను కట్టారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు మహంకాళీ స్వామి, ఎండీ.ముస్తఫా, గాదం విజయానంద్, పెద్దెల్లి ప్రకాష్, రవియాదవ్, తాళ్లపెల్లి యుగేందర్, గట్ల రమేశ్, బొమ్మక రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, సింహాచలం, పంజా శ్రీనివాస్, లక్ష్మణ్ బాబు, ధూళికట్ట సతీశ్, కొటం సతీష్, నాగరాజు, విజయ్ తదితరులున్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలి

- రైతులకు రుణమాఫీ చేసి తీరాల్సిందే..
- కాంగ్రెస్ సంతకాల సేకరణకు మద్దతు
- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు


మాట్లాడుతున్న ప్రకాశ్ రావు

సుల్తానాబాద్: నిరుద్యోగ భృతిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు రైతులకు రుణమాఫీ అమలు చేయాలన్నారు. మేనిఫెస్టో అమలు చేయాలని కాంగ్రెస్ చేపట్టే సంతకాల సేకరణకు తన మద్దతు ఉంటుందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంతోపాటు మరో 30 నియోజకవర్గాల్లో రైతులు, నిరుద్యోగులతో కలిసి రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని వివరించారు. ఆయన వెంట జెడ్పీటీసీ గంటా రాములుయాదవ్, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి, జెడ్పీ మాజీ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ.హాజీ, ఎల్లా స్వామి, ఐలయ్య, మురళి, మారం పోశాలు, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో మరిన్ని మెలకువలు నేర్చుకోవాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


సిమ్యులేటర్ నడుపుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): శిక్షణలో మరిన్ని మెలకువలను నేర్చుకుని, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పని చేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. శిక్షణ పొందిన అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్‌లను ఆయన అభినందించారు. 12 రోజులపాటు కొనసాగిన శిక్షణ గురువారం ముగిసింది. సూపర్‌వైజర్లు బాధ్యతతో ముందుకు సాగాలని జీఎం అన్నారు. పనిస్థలాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఆర్డీ జీఎం వెంకటేశ్వర్‌రావు, ఎస్ఓటూ జీఎం రామ్మోహన్‌రావు, ఇంజినీర్ రామ్మూర్తి, టీటీసీ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రి సత్యవతిరాథోడ్‌కు వినతిపత్రం ఇస్తున్న సాయిరాంనాయక్

రామగుండం: పెద్దపల్లి జిల్లా పరిధిలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు భూక్య సాయిరాంనాయక్ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఉపాధి కల్పన నిమిత్తం రుణాలు మంజూరు చేయించాలని విన్నవించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గిరిజనశాఖ అధికారులతో ప్రత్యేక కార్యాలయం ప్రారంభించి, గిరిజనుల సమస్యలకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

మంథని: ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్, జిల్లలపల్లి, ఖమ్మంపల్లి గ్రామాల శివారు అటవీ ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు సీఐ గురువయ్య తెలిపారు. సాటుసారా రవాణా చేసినా, విక్రయించినా, తయారీకి ఉపయోగించే వస్తువులతో పట్టుబడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ ధ్వంసంపై కేసు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో తన స్థలంలోని ప్రహరీని కూల్చారని బాధితుడు జెట్టి రమేశ్ ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. రమేశ్ తనకు చెందిన మూడు గుంటల స్థలంలో ప్రహరీ నిర్మించాడు. కట్ల శ్రీనివాస్, మేకల శ్రీనివాస్ దాన్ని ధ్వంసం చేశారని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ తెలిపారు.